# ఆగమాగం ఓటేస్తే రైతు బతుకు ఆగమే!





## 10 హెచ్‌పీతో రైతుకు భారమే

రైతులు వ్యవసాయానికి ఎక్కువగా 3 హెచ్‌పీ మోటర్లు వాడతరు. ఎక్కువ దూరం పైపులు వాడితే మాత్రమే 5 హెచ్‌పీ మోటర్లు వాడతరు. 10 హెచ్‌పీ మోటర్లు వాడితే విద్యుత్ లోవోల్టేజీ సమస్యలతో పాటు రైతులకు అధిక భారమవుతుంది. ప్రస్తుతం ఉన్న పైపులైన్లు, మోటర్లు, స్టాటర్లు మార్చవలసి వస్తుంది. లక్షల్లో ఖర్చు చేయాల్సి వస్తుంది. రైతులకు అదనపు భారం పడుతుంది. కమర్షియల్ విద్యుత్ కనెక్షన్లు తీసుకోవల్సి వస్తుంది. 10 హెచ్‌పీ మోటర్లకు అధిక విద్యుత్ అవసరం ఉంటుంది. ఇప్పుడు ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లు, పని చేయవు. గతంలో లోవోల్టేజీ, కోతలతో రైతులు మస్తు ఆగమైన్రు. మళ్లీ ఆ బాధలు పడాలని ఏ రైతు కూడా కోరుకోడు. కోరి కరెంటు కోతలు తెచ్చుకోడు. కేసీఆర్ వచ్చినంక కరెంటు బాధలు తప్పినయ్.

**- ఎల్లాల దేవేందర్ రెడ్డి, భూపతిపూర్ (రాయికల్ మండలం)**

### వాళ్లకు అధికారం ఇచ్చేదెవరు.. పాలించేదెక్కడ..

నాకు మా ఊళ్లే కొంత వ్యవసాయ భూమి ఉన్నది. ఇప్పుడు కేసీఆర్ సారు ఇచ్చిన రైతుబంధు, 24 గంటల కరెంటుతో మంచిగ పంటలు పండించుకుంటున్నం. గా కాంగ్రెస్ నాయకుడు రేవంత్‌రెడ్డి మూడు గంటల కరెంట్ చాలు అన్నంక మాకు బాధైంది. మూడుగంటలు ఉంటే ఒక్క మడి కూడా తడవదు. తెలంగాణ ప్రభుత్వం 24 గంటల కరెంట్ ఇస్తుండటంతో మోటర్ల ద్వారా పంటలు బాగా పండిస్తున్న. కాంగ్రెసోళ్ల మాటలతో మళ్లీ పాత రోజులే వస్తయని భయమేస్తుంది. అప్పట్ల రాత్రి పూట12 గంటలకు కరెంట్ పెట్టడానికి పొలాలకు పోయచ్చేది. ఆ కష్టాలు మళ్లీ అనుభవించం. 24 కరెంట్‌తో ఆటోమెటిక్ మోటర్లు పెట్టుకుని కష్టాలు లేకుండా సాఫీగా సాగు చేసుకుంటున్నం. మల్ల గా కాంగ్రెసోళ్లను రానియ్యం. అయినా వాళ్లకు అధికారం ఇచ్చేదెవరు..? వాళ్లు పాలించేదెక్కడ..? రైతుల కోసం ఆలోచించే కేసీఆర్ సారే మళ్లీ రావాలి.

**- నల్ల పవన్ రెడ్డి, కుమ్మరిపెల్లి (రాయికల్ మండలం)**



### మేం మంచిగుండుడు కాంగ్రెసోళ్లకు ఇట్టం లేదు..

పదేళ్ల నుంచి మంచిగ బతుకుతున్నం. మేం మంచిగుండుడు కాంగ్రెసోళ్లకు ఇట్టం లేదు. మూడు గంటల కరెంటు సాలని ఒగడు.. 10హెచ్‌పీ మోటారని ఒగడు. మూడు గంటలెట్ల సాలుతది. 10హెచ్‌పీ ఎవడు కొంటడు. ఎవుసం తెల్వనోడు మాట్లాడితే ఐపోతదా..ఏంది. మమ్మల్ని కోతకేత్తరా ఏంది. 10హెచ్‌పీతోటి ట్రాన్స్‌ఫార్మర్లు ఉంటయా..? కాలిపోతయ్. మళ్ల కరెంటోళ్ల సుట్టూ తిరగాల్నా. పంటలెండల్నా. అయినా ఇప్పుడున్న మోటార్లతోటి హాయిగున్నం. మడులు తడుస్తున్నయ్. మళ్ల 10హెచ్‌పీలు లక్షలు పెట్టి ఎట్లా కొంటం. అప్పుల పాల్జేత్తరా ఏంది. ఇప్పుడు రందిలేకుండా పెళ్లం, పిల్లలతో మంచిగ బతుకుతున్నం. మా బతుకుల మీద దెబ్బ కొడ్తమంటే ఎందుకూరుకుంటం. పదేళ్ల నుంచి దగ్గరి రాకుండా సేసినం. బుద్ధి రాలే. మళ్లీ మా మీదకు వత్తన్న రేవంత్ రెడ్డికి తగిన గుణపాఠం చెప్తం. బీఆర్ఎస్‌నే గెలిపించుకుంటం.

**- అంబల్ల రాంరెడ్డి, రామాజిపేట (రాయికల్ మండలం)**



# కాంగ్రెస్‌ను నమ్మితే కరెంట్ ఖతమే

### ఆ పార్టీకి అవకాశమిస్తే మోటర్లకు మీటర్లస్తయి

- ఉచిత కరెంట్ లేకుంట పోతది
- ఎవుసాన్ని నమ్ముకున్న రైతుల బతుకు ఆగమైతది
- మళ్లీ పాత రోజులు వస్తయి
- బాయిలకాడ జాగారమే అయితది
- ఆ నాయకులను నమ్మనే నమ్మద్దు
- కేసీఆర్‌ను గెలిపించుకుంటేనే మనకు బతుకు
- తేల్చి చెబుతున్న అన్నదాతలు

జగిత్యాల, నవంబర్ 25 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్‌కు ఓటేస్తే బతుకు దెరువు కరువైతదని, పదేండ్ల కిందటి చీకటి రాజ్యం మళ్లీ వస్తదని జిల్లా రైతులు ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా కరెంట్ విషయంలో రైతులు పడిన కష్టాలను గుర్తు చేసుకుంటున్నారు. అప్పట్లో ఇచ్చిన కరెంట్‌తో పంటలు పండక నష్టపోయిన తీరును ఇప్పుడు గ్రామాల్లో రచ్చ బండల వద్ద చర్చకు పెడుతున్నారు. రాత్రి పూట కరెంట్ ఇవ్వడం వల్ల రైతులు అర్ధరాత్రి, అపరాత్రి బాయిల వద్దకు వెళ్తే ఎదురైన భయంకర అనుభవాలను మర్చిపోలేక పోతున్నామని చెప్పుకుంటున్నారు. రాత్రి పూట బావుల వద్దకు వెళ్తే పాములు, కరిచి, గుడ్డేలుగుల దాడులకు గురై, ఆఖరికి కరెంట్ షాక్‌లతో చనిపోయిన రైతులను గుర్తు చేసుకుంటున్నారు. ఇప్పుడు వాళ్ల కుటుంబాలు పడుతున్న బాధలను చూసి చలించి పోతున్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాకముందే మూడు గంటల కరెంట్ ఇస్తామని చెబుతుండటంతో రైతులు తీవ్రంగా ఆగ్రహిస్తున్నారు. ఇలాంటి పార్టీకి అధికారం ఇస్తే నిజంగానే మూడు గంటల కరెంట్ ఇస్తుందనే భయం రైతుల్లో వ్యక్తమవుతోంది. కరెంట్ విషయంలో బీఆర్ఎస్ ప్రభుత్వం తెచ్చిన సంస్కరణలను గుర్తు చేసుకుంటున్నారు. కాంగ్రెస్‌ను నమ్మితే బతుకుదెరువు ఖతమైతదని, బాయిల కాడ నిద్రలు తప్పవని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మోటర్లకు మీటర్లు పెడితే భూములు పడావు పెట్టుడేనని చెబుతున్నా. రాష్ట్రంలో ఏ రైతైనా 10 హెచ్‌పీ మోటర్ కొనే పరిస్థితి ఉందా? అని, అంత పెద్ద మోటర్లు, వాటికి అవసరమయ్యే పైపులకు ఖర్చు ఎవరు భరిస్తారని ప్రశ్నిస్తున్నారు. కాంగ్రెస్ వచ్చేదు లేదు.. సచ్చేది లేదుగానీ, పనికిరాని ముచ్చట్లు మాట్లాడుతున్నదని, ఆ పార్టోళ్లను ఎవరూ నమ్మరని స్పష్టం చేస్తున్నారు. ఇప్పుడు పొద్దంతనే అవసరం ఉన్నప్పుడే వెళ్లి కట్క నొక్కితే కరెంట్ వస్తోందని, ఇలాంటి ప్రభుత్వాన్ని కాదని కాంగ్రెస్‌కు ఓటేస్తే తెర్లవుతామనే వాదనలు రైతాంగం నుంచి వినిపిస్తున్నాయి.

### వాళ్లకు ఎద్దేర్కనా..? ఎవుసమేర్కనా..?

కాంగ్రెస్ పాలనల రైతులకు తీరని అన్యాయం జరిగింది. అది తల్సుకుంటనే భయమైతది. తెలంగాణ వచ్చిన తర్వాతే మేం కోలుకున్నం. 24గంటల కరెంట్ అత్తంది. పుష్కలంగా నీళ్లున్నయి. ఏటా రెండు పంటలు పండించుకుంటున్నం. తెలంగాణ రాక ముందు రైతులను అరిగోస పెట్టిన కాంగ్రెసోళ్లు, ఇప్పుడు మళ్లీ వస్తున్రు. వాళ్ల అధికారం కోసం ఏవేవో చెబుతున్రు. మంచిగున్న కరెంట్‌పై మాయమాటలు చెబుతున్రు. 24 గంటలు ఎందుకు.. మూడు గంటలు చాలు అని అంటున్నరు.10 హెచ్‌పీ మోటర్ పెట్టుకోవాలని అంటున్నరు. మతి లేని మాటలు మాట్లాడుతున్నరు. రైతులను ఆగం చేసుడు తప్పితే ఏం లేదు. పెద్ద మోటర్ పెడితే లక్ష యాభైవేలు అయితయట. నాలాంటి చిన్న సన్నకారు రైతులు ఎక్కన్నుంచి తెస్తరు? ఎవుసం చేసేటోళ్లకైతే మా బాధలు తెలుస్తయి. కాంగ్రెసోళ్లకు ఏం తెలుసు? ఎద్దెరుకనా.. ఎవుసమెరుకనా? అందుకే ఇష్టం వచ్చినట్టు మాట్లాడుతున్నరు. రైతు బిడ్డ అయిన కేసీఆర్‌కు మా బాధలు తెలుసు కాబట్టే మాకు మంచి చేస్తున్నడు. సారు మళ్లీ రావాలి.

**- కాటిపెల్లి శ్రీనివాస్‌రెడ్డి (మల్యాల మండలం)**



### భూములు మింగాలని చూస్తున్నరు..



ధరణి లేక ముందు ఎవరి భూములు ఎవరి పేరు మీద ఎక్కుతుందో తెలువని పరిస్థితి. కానీ ఇప్పుడు పారదర్శకంగా భూపట్టా మార్పిడి జరుగుతంది. కాంగ్రెస్ ధరణి తీసివేస్తామని మాట్లాడుతంది. వాళ్లకు వచ్చిన బాధేంది. వాళ్లు మంచి చేయరు.. చేసేటోళ్లను చేయనివ్వరు. అయినా వాళ్లు అచ్చేది లేదు.. సచ్చేది లేదు గానీ మాటలు మాత్రం కోటలు దాటుతున్నయ్. వాళ్ల పాలనలో మేం ఎన్ని బాధలు పడ్డామో.. ఇంకా మరిచిపోలేదు. వాని భూమి వీనికి రాసి, ఎన్ని తాకులాటలు పెట్రిన్రో యాదికి వస్తేనే దుఃఖ మస్తది. కానీ ఇప్పుడు మా భూములు భద్రంగా ఉన్నయి. ఇట్లా రిజిస్ట్రేషన్ కాగానే అట్లా పట్టా చేతికి వస్తంది. మ్యుటేషన్ కూడా అయితంది. ఇప్పటికైనా కాంగ్రెసోళ్లు పిచ్చిపిచ్చి మాటలు మాట్లాడొద్దు.

**- చింతలపల్లి వెంకటేశ్వర్ రెడ్డి, కుమ్మరిపెల్లి, (రాయికల్ మండలం)**

### ధరణిని తీసెస్తే భూములకు భద్రత ఉండదు

కాంగ్రెస్ ధరణిని తీసెస్తే భూములకు భద్రత ఉండదు. మళ్లీ పటేల్, పట్వారీ వ్యవస్థ తెస్తమంటున్నరు. గతంలో భూములను ఎవరు పైసలు ఇసే వాళ్ల కు రాసేటోళ్లు. అది సరిచేసుకోవడానికి నెలల కొద్ది ఆఫీసుల చుట్టు తిరిగాల్సి వచ్చేది.ధరణి వచ్చినంక నేను నా ఎకరం భూమిని అమ్మి ఎవరికీ పైసలు ఇవ్వకుండా, దళారీ వ్యవస్థ లేకుండా రిజిస్ట్రేషన్ చేయించుకున్న. రిజిస్ట్రేషన్ అప్పుడు భయం కూడా కాలే. పకడ్బందీగా రిజిస్ట్రేషన్ జరిగింది. కానీ గతంలో రిజిస్ట్రేషన్ అయ్యేంత వరకు కూడా భయం ఉంటుండే. పట్వారీలు ఎప్పుడు ఏమంటరో అని భయం ఉండే. ధరణిని తీసేసి పాత పద్ధతి తెస్తే కబ్జాదారులు రాజ్యమేలుతరు. గతంలో పట్వారీలు పైసలకు ఆశపడి ఓకే భూమిని ఇద్దరి పేరు మీద చేసిన దాఖలాలు ఉన్నయి. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. అంతా అన్‌లైన్‌లోనే ఉంటుంది. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే లంచాల రాజ్యం వస్తుంది. ప్రశాంతంగా ఉన్న రైతుల బతుకుల్లో నిప్పులు పోసేందకు కాంగ్రెస్ ధరణిని తీసేస్తామంటుంది. ఇలా అక్రమాలకు చోటు ఇచ్చే కాంగ్రెస్‌కు ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతం.

**- అల్లూరి నరసింహరెడ్డి (మల్యాల మండలం)**



### కాంగ్రెసోళ్లను బంగాళాఖాతంలో పారేస్తం..

ధరణితోటి పని జెల్ది ఐతంది. ధరణి లేక ముందు రిజిస్ట్రేషన్‌కు ఒక రోజు సమయం పట్టేది. 30 కిలోమీటర్లు దూరంలో ఉన్న రిజిస్ట్రేషన్ ఆఫీస్‌కు వెళ్లి రిజిస్ట్రేషన్ చేసుకునే వాళ్లం. అప్పుడు పొద్దుగాల పోతే రాత్రయినా పని ఐతదో కాదో అన్నట్లు ఉండే పరిస్థితి. సపరేటు ఆటోల పనివడ పోతే అక్కడి సార్లు అది లేదు. ఇది లేదు అని పైసల కోసం వంకలు పెట్టేటోళ్లు. మేం ఆగమై ఇవాళ పనికాకుంటే ఎట్ల, గింతమందిమి వస్తిమి అని పైసలిచ్చి పని చేపించుకునేది. కానీ ధరణితో అప్పటికి ఇప్పటికీ చాన మారింది. మా మండల ఆఫీసులనే రిజిస్ట్రేషన్లు చేస్తన్రు. దూరం తగ్గింది. పని కూడా మనుపటి కంటే చాన తొందరైతంది. అట్లా రిజిస్ట్రేషన్ కాగానే వెంటనే మ్యూటేషన్ కూడా అయిపోతుంది. ఇంత మంచి ధరణిని కాంగ్రెసోళ్లు బంగాళాఖాతంలో వేస్తరట. వాళ్లకు ఏమైనా తెలివి ఉందా..? వాళ్లనే మేమందరం కలిసి బంగాళాఖాతంలో తోసేస్తం. ధరణి ఉండా ల్సిందే.

**- గొల్లపల్లి వేణుకుమార్, రామాజీపేట (రాయికల్ మండలం)**



# ధరణి జోలికొస్తే ఊరుకోం

- రద్దు చేస్తమన్న కాంగ్రెస్‌ను మేం రద్దు చేస్తం
- ఆ పార్టీకి ఈ ఎన్నికల్ల తగిన బుద్ధి చెబుతం
- భూములకు భద్రత కల్పించిన కేసీఆర్‌కే ఓటేస్తం
- బీఆర్ఎస్‌ను కాపాడుకుంటం

జగిత్యాల, నవంబర్ 25 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ కాకుండా ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా తమ భూములకు భద్రత లేకుంటా పోతదని, తిరిగి గతంలో అనుభవించిన బాధలు మొదలవుతాయని జిల్లా రైతులు స్పష్టం చేస్తున్నారు. ఎన్నో రోజులు కష్టపడి, అనేక వ్యయప్రయాసలకు ఓర్చుకుని కొత్త రెవెన్యూ చట్టం తెచ్చి తమ భూములకు భద్రత కల్పించింది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని స్పష్టం చేస్తున్నారు. ఒకప్పుడు తమ భూములకు సంబంధించిన హక్కులు, అధికారాలు ప్రభుత్వం చేతిలో ఉండేవని, కొత్త చట్టం వచ్చిన తర్వాత ఏర్పడి ధరణి కారణంగా ఇప్పుడు తమ భూములపై తమకే అధికారం వచ్చిందని అభిప్రాయపడుతున్నారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే ధరణిని తీసి బంగాళాఖాతంలో పడేస్తామని కాంగ్రెస్ నాయకులు చెప్పే విషయాలపై రైతులు తీవ్రంగా ఆగ్రహిస్తున్నారు. ధరణి ఉండడం వల్లనే ఈ మూడు నాలుగేళ్ల నుంచి భూములు గొడవలు తగ్గాయని అంటున్నారు. యాభై ఏండ్లకు పైగా పాలించిన కాంగ్రెస్ ఇంత మంచి ఆలోచన ఎందుకు చేయలేక పోయిందని ప్రశ్నిస్తున్నారు. ఈ వ్యవస్థను రద్దు చేయాలని కాంగ్రెస్ నాయకులు చెప్పిన మరుక్షణమే ఆ పార్టీకి పుట్టగతులు లేకుండా పోయాయని చెబుతున్నారు. ధరణిని తొలగిస్తామని చెప్పే కాంగ్రెస్ పార్టీకి గట్టి బుద్ధి చెప్పక తప్పదని హెచ్చరిస్తున్నారు.



### అది కాంగ్రెస్ కాదు.. భూ 'స్కాంగ్రెస్'

కాంగ్రెసోళ్లు ఎన్ని భూములు గోల్‌మాల్ చేశారో మాకు తెలుసు. రైతును ఎన్ని ఇబ్బందులు పెట్టారో మేం మరిచిపోయినమా..? ధరణిని తీసేసి బంగాళాఖాతంలో వేస్తమని మాట్లాడుతున్నరు. ఎందుకు మళ్లీ భూములు దోచుకునేందుకా..? ధరణి వల్ల రైతులకు ధైర్యం పెరిగింది. భూమి అమ్మాలి, కొనాలి అన్నా సులువు అయింది. ఇంత మంచి సౌలాత్‌ను కాంగ్రెసోళ్లు తీసివేయాలనే ఆలోచన చేయడం దుర్మార్గం. ధరణి తీసివేసి పాత కాలమ్స్ వెళ్తే గందరగోళ పరిస్థితులు ఏర్పడతాయి. అనుభవదారుడు, కౌలుదారుడు పేర్లు నమోదు చేస్తామనడం సరికాదు. మళ్లీ కొట్లాటలు అయితయి. మళ్లీ పట్వారీ వ్యవస్థను తీసుకువచ్చి పాత పద్ధతిల పాత విధానాన్ని తీస్కత్తే అందరం ఆగమైతం. మీరు వద్దు. మీ పాలన వద్దు. మాజోలికి రావద్దు. మాకు ఇప్పుడున్న ధరణే కావాలి. మళ్లీ కేసీఆరే రావాలి.

**- తీగల నారాయణ రెడ్డి, భూపతిపూర్, (రాయికల్ మండలం)**



### మా భూములు ఆగంజేత్తరా..?

మాది రాయికల్ మండలం ఇటిక్యాల. ఇప్పుడు ధరణి ఉండడం వల్ల మా భూములు ఆన్‌లైన్‌లో కనబడుతున్నయి. ధరణి లేనప్పుడు మా పాస్‌బుక్‌ల పై భూమిఉండేది, పహాణీలో చూస్తే ఉండేది కాదు. అప్పుడున్న రెవెన్యూ వ్యవస్థ రైతులను ఆగంచేసింది. పాస్‌బుక్‌లో ఉన్న భూమి మోక పై లేకుండే, ఇష్టంవచ్చినట్లు రెవెన్యూ అధికారులు మార్చేటోళ్లు. ఇప్పుడు పట్టా పాస్‌బుక్ పై ఎంత భూమి ఉందో ధరణి వెబ్‌సైట్‌లో అంతే ఉంటుంది. ధరణి వల్ల మా భూమి భద్రంగా ఉంది. ధరణి తీస్తే మా భూములు ఆగమై గొడవలు జరుగుతయి. గెట్టు పంచాయితీలు మళ్ల అయితయి. కాంగ్రెస్ పాలన ఎట్ల ఉంటదో ఇంతకుముందు మేం చూడలేదా..? వాళ్ల ఆటలు ఇక్కడ సాగవు. మీరు వచ్చేది లేదు.. సచ్చేది లేదు.

**- ఓరుగంటి లక్ష్మణ్, ఇటిక్యాల (రాయికల్ మండలం)**



### మీ ఆటలు ఇక్కడ సాగయ్..

కాంగ్రెస్ నాయకుల మాటలు నమ్మితే రైతులు ఆగమైతరు. రేవంత్‌రెడ్డికి వ్యవసాయంపై ఏమాత్రం అవగాహన లేనట్టుంది. ఏవో నోటికొచ్చిన ఉత్తి మాటలు చెప్పిండు. కాంగ్రెస్, టీడీపీ ప్రభుత్వాల పాలనలో రైతులు కేవలం 5 హెచ్‌పీ మోటర్లు అంతకంటే తక్కువ మోటర్లు పెట్టి వ్యవసాయం చేసేటోళ్లు. అలాంటి చిన్న మోటర్లకే బావుల్లో నీరు ఉండక మోటర్లు మొత్తం కాలిపోయేవి. పైగా అప్పుడు నాణ్యమైన కరెంటు ఉండేది కాదు. అప్పుడు కరెంటు ఎప్పుడు వచ్చేదో.. ఎప్పుడు పోయేదో ఎవరికీ తెల్వదు. కరెంట్ రాగానే రైతులు మొత్తం ఒకేసారి మోటర్లు వేయడం వల్ల ట్రాన్స్‌ఫార్మర్ పేలిపోయేది. వాటిని రైతులే తీసుకుపోయి రోజుల తరబడి కాపు కాస్తు మరమ్మతులు చేయించుకునేది. రైతులు రోజుల తరబడి దుకాణం చుట్టూ తిరిగి తిప్పలు పడేటోళ్లు. రేవంత్‌రెడ్డి చెప్పినట్టు 10 హెచ్‌పీ మోటర్ పెడితే కనీసం గంట కూడా నడువది. ఎంత పెద్ద బావి అయినా సరే గంటలోపే మొత్తం బావిలో నీళ్లన్నీ ఎత్తిపోస్తయ్. ఇప్పుడు మోటర్లకు మీటర్లు పెడతమంటున్రు. చచ్చినా కాంగ్రెస్, బీజేపీ మాట నమ్మం. నమ్మితే మళ్లీ మా బతుకులు ఆగం చేస్తరు. అయినా వాళ్ల ఆటలు ఇక్క సాగవు. మాకు మెట్‌పల్లిలో ఆరెకరాల భూమి ఉంది. వరి పంట సాగుచేస్తున్నం. ఇప్పుడే మాకు మంచిగుంది. కేసీఆర్ వెంటే ఉంటం.

**- మార్గం గంగారాం, రైతు (మెట్‌పల్లి)**

### వాడద్దు.. వాని కరెంట్ వద్దు..

నేను చానా ఏండ్ల నుంచే ఎవుసం చేస్తున్న. ఎనకట పొద్దంత పనిఇడిసి పెట్టుకుని కరెంటు ఎప్పుడు వస్తదా అని ఎదురుచూసేది. అచ్చిన కరెంటు అద్దగంటకోసారి ట్రిప్పయ్యేది. గలుమ పారేవరకు మళ్ల పోయేది. తడిసిన మడి మల్ల తడిసేది. గిట్టా కాలం ఎల్లాదీసుకుంటూ వచ్చినం. కేసీఆర్ సీఎం అయినంక 24గంటల కరెంటు ఇత్తాండు. మాలాంటి రైతుల కష్టాలను తీర్చిండు. ఎప్పుడు అసరం ఉంటే అప్పుడే బావి కాడికి పోయి నీళ్లు పెట్టుకుంటున్నం. ఇంతకన్నా మాకు ఏమి అవసరం లేదు. మళ్లీ కేసీఆరే సీఎం కావాలి. కాంగ్రెస్ వస్తే మళ్లీ ఎనకటి కాలం వస్తది. వాడద్దు.. వాని కరెంట్ వద్దు. ఇప్పుడే మంచిగుంది.

**- బేతి మోహన్ రెడ్డి, రామాజీపేట (రాయికల్ మండలం)**



### కాంగ్రెసోళ్లస్తే ఎవుసం తెర్లే

నాకు మెట్‌పల్లిలో 1.31 ఎకరాల భూమి ఉంది. మరో మూడెకరాలు కౌలుకు తీసుకున్నా. వరే పండిస్తున్న. రంది లేదు. కాంగ్రెస్‌కు ఓటేస్తే రైతులకు పాత కష్టాలు తప్పవు. పంట పండించుకునే పరిస్థితులు ఉండవు, మళ్లీ బీడు భూములే దర్శనమిస్తయి. ఎవుసం తెర్లు అయితది. కాంగ్రెస్ నాయకులకు వ్యవసాయం మీద సరైన అవగాహన లేదు. ఆ పార్టీ వచ్చేది లేదు.. సచ్చేది లేదు. వ్యవసాయానికి 3 గంటలు కరెంట్ సరిపోతదని, 10హెచ్‌పీ మోటర్లను వ్యవసాయ బావుల వద్ద ఏర్పాటు చేసుకోవాలని చెప్పిన రేవంత్‌రెడ్డికి కనీస జ్ఞానం లేదు. కనీసం 10 నుంచి 12 మంది రైతుల మోటర్ల విద్యుత్ కనెక్షన్లు ఒక 50 హెచ్‌పీ ట్రాన్స్‌ఫార్మర్‌పై ఆధారపడి ఉంటయి. అదే 25 హెచ్‌పీ ట్రాన్స్‌ఫార్మర్ అయితే 6 నుంచి 7 మోటర్లు ఉంటయి. అవి కూడా 3, 5హెచ్‌పీ మోటర్లు మాత్రమే. కానీ, ఒక్క వ్యవసాయ బావి వద్ద 10హెచ్‌పీ మోటరు పెడితే ఎలా సాధ్యమైతది. ట్రాన్స్‌ఫార్మర్ల కెపాసిటీ తక్కువ ఉండడంతో రైతుల మోటర్లు కాలిపోతయ్. మళ్లీ కరెంట్ కష్టాలు వస్తయి. పొరపాటున కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రైతులకు కష్టాలు కొనితెచ్చుకున్నట్లు అయితది.


**- నీలికుడక అంజయ్య, రైతు ( మెట్‌పల్లి)**



### మళ్లీ ఆఫీసుల చుట్టూ తిరుగుడే..

రైతుల సంక్షేమం కోసం సీఎం కేసీఆర్ తీసుకొచ్చిన ధరణితోనే రైతులకు పక్కాగా రైతుబంధు వస్తున్నది. కాంగ్రెస్ వస్తే ధరణి , రైతుబంధు ఉండదు. మళ్లీ రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరుగుడే. గతంలో భూములు పట్టాచేయించుకునేందుకు వీఆర్వో దగ్గరికి ఎన్ని రోజులు తిరిగినా పని కాకపోయేది. సీఎం కేసీఆర్ తీసుకొచ్చిన ధరణితో సులభమైన పద్ధతిలో స్లాట్ బుక్ చేసుకొని పది నిమిషాల్లో భూమి రిజిస్ట్రేషన్ చేసుకుంటున్నరు. ఎన్నికల వేళ కాంగ్రెస్ నాయకులు వచ్చి మాయమాటలు చెబుతున్నరు.ఇకపై వారి ఆటలు సాగవు. మంచిగా పరిపాలించే కేసీఆర్ సార్ మళ్లీ రావాలి. ముఖ్యమంత్రిగా ఆయననే ఉండాలి. రైతులు సుఖంగా ఉంటున్నారు. ధరణితో భూసమస్యలు తగ్గినయ్.

**- కాటిపల్లి చిన్న స్వామిరెడ్డి, ముత్యంపేట (మల్యాల మండలం)**



జాతీయ న్యాయ దినోత్సవ శుభాకాంక్షలు
గత 31 సంవత్సరాలుగా మా ఉన్నతికి సహకరించిన మా కక్షిదారులకు, మా శ్రేయోభిలాషులకు మరియు న్యాయమూర్తులకు, మా తోటి న్యాయవాదులకు,
జాతీయ న్యాయ దినోత్సవ శుభాకాంక్షలు...

బొడ్ల శ్రీనివాస్ B.A.,LL.B. Advocate
బొడ్ల గీతారాణి B.Com.,LL.M. Advocate
బొడ్ల [illegible] B.B.A, LL.B, (Symbiosis) LL.M (London) Advocate
ఇ.నెం. 2-9-36, "గీతాశ్రీనివాసం"
పాత కూరగాయల మార్కెట్ రోడ్, ముకరాంపుర, కరీంనగర్. మొబైల్: 9440082034